## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:265 | సోమవారం ఏప్రిల్ 27, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# టీఎంసీ ఉన్నంతకాలం

## బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదు: మోదీ

**తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధికారంలో ఉన్నంత కాలం బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదని, మహిళలను హింసించే గూండాలకు ఆ పార్టీ అండగా నిలుస్తోందని ప్రధాని విమర్శించారు.**





- **ఆర్జీకర్ ఘటన:** మహిళల రక్షణ పట్ల తమకున్న నిబద్ధతకు నిదర్శనంగానే ఆర్జీకర్ మృతురాలి తల్లికి భాజపా ఎన్నికల టికెట్ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు.
- **చట్టపరమైన చర్యలు:** రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలపై దారుణాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.
- **ప్రభుత్వ వైఫల్యం:** రాష్ట్రంలో బాలికలు అదృశ్యమవుతున్నా టీఎంసీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు.
- **రైతులు ఔ కార్మికుల సంక్షేమం:** గత 11 ఏళ్లలో జనపనార కనీస మద్దతు ధరను (మీఫ్రా) రెట్టింపు చేశామని తెలిపారు.

తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతవరకు బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్త్రీలను హింసించే గూండాలకు ఆ పార్టీ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే మహా జంగిల్ రాజ్ నుంచి రక్షణ కల్పిస్తామన్నారు. మహిళల రక్షణ గురించి తాము ఆలోచిస్తాం కాబట్టే ఆర్జీకర్ మృతురాలి తల్లికి తమ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల టికెట్ ఇచ్చామన్నారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలపై దారుణాలకు పాల్పడిన నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడతామన్నారు. బంగావ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.

2లో..

# ప్రతి ఫైల్‌కు పాస్‌వర్డ్:

## టీసీఎస్ నాసిక్ ప్రధాన నిందితుడి జాగ్రత్తలు

నాసిక్ టీసీఎస్‌లో లైంగిక వేధింపుల కేసు విచారణకు సంబంధించి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన నిందితుడి ఫైల్స్, ఫోన్ దర్యాప్తునకు ప్రధాన ఆటంకంగా మారాయి. ప్రతి దానికి అతడు పాస్‌వర్డ్‌లు పెట్టడంతో వాటిని ఓపెన్ చేయడం సవాల్‌గా మారింది.

2లో..



# తెరలు తెరలుగా సమస్యలు..

## పిల్లల్ని ముంచెత్తుతున్న డిజిటల్ తరంగాలు

**మొబైల్.. ట్యాబ్.. డెస్క్‌టాప్.. ల్యాప్‌టాప్... ఏదైనా కావొచ్చు... డిజిటల్ తరంగాలు పిల్లల్ని ముంచెత్తుతున్నాయి.**



మెదళ్లను అదుపులోకి తీసుకుంటున్నాయి. దీంతో వారి మానసిక, అభ్యసన సామర్థ్యాలు బాగా దెబ్బతింటున్నాయి. చిన్నపాటి జాగ్రత్తలతో పిల్లలపై దుష్ప్రభావాన్ని తగ్గించవచ్చని బ్రిటన్‌లోని షెఫీల్డ్ వర్సిటీ అధ్యయనం సూచిస్తోంది. పిల్లల మెదళ్లు స్పాంజిలాంటివి. ఎదిగే క్రమంలో అవి ఎక్కువ విషయాలను గ్రహిస్తాయి. మంచినీ, చెడునీ నిక్షిప్తం చేసుకుంటాయి. అయితే అతి చిన్న వయసులోనే స్క్రీన్‌కు అలవాటు పడుతుండడం తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. పలు రకాల సమస్యలు వారిని చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా వారిలో నైపుణ్యాలు నేర్చుకునే స్వభావం దెబ్బతింటోంది. పిల్లల్లో మెదడు ఐదేళ్ల వయసు వచ్చేసరికి 90 శాతం అభివృద్ధి చెందుతుంది. కానీ వారు అదేపనిగా స్క్రీన్ చూడడం వల్ల ప్రతికూల ప్రభావాలు మొదలవుతాయి. వారు పరధ్యానంగా మారుతున్నారని షెఫీల్డ్ అధ్యయనం పేర్కొంది. అందుకే ఐదేళ్లలోపు పిల్లలకు రోజూ గంటకు మించి స్క్రీన్ సమయం ఇవ్వద్దని తల్లిదండ్రులకు సిఫారసు చేసింది. ఉద్యోగాల్లో, పనుల్లో తీరికలేకుండా ఉన్న తల్లిదండ్రులకు ఇది అసాధ్యంలా అనిపించొచ్చు. కానీ పిల్లలపై స్క్రీన్ సమయం దుష్ప్రభావం చూపకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. వాళ్లు ఏడుస్తుంటే మొబైల్ ఇచ్చి ఆడుకోమనడం,

2లో..



| ఏ వయసులో... మెదడు అభివృద్ధి ఎంత? | పుట్టిన వెంటనే... | ఏడాది వయసు... | మూడేళ్లకు... | ఐదేళ్లకు... | ఏడేళ్ల వయసులో... |
|---|---|---|---|---|---|
| | 25% | 70% | 85% | 92% | 95% |

## ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించిన తెలుగు తేజాలు.. నారా లోకేశ్ అభినందనలు




ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించిన 21 మంది ప్రత్యేక ప్రతిభావంతులను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. అంగవైకల్యాన్ని జయించి ఈ ఘనత సాధించిన తెలుగు తేజాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏటా ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వారు కేవలం విద్యార్థులే కాదని.. రేపటి తరానికి రోల్ మోడల్స్ అని ప్రశంసించారు.

## అల్లూరి జిల్లాలో 749 కిలోల గంజాయి స్వాధీనం



ముంచంగిపుట్టు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ మొత్తంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు పంచాయతీ సంఘం వలస గ్రామ సమీపంలో కాఫీ తోటల్లో నిల్వ ఉంచిన 749 కిలోల గంజాయిని ఎస్సై నాని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.3.45 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా చేశారు.

# రేవంత్ సర్కార్ శుభవార్త..

## మహిళల కోసం మరో పథకం..

### ఉచితంగా పంపిణీ





- తెలంగాణ మహిళలకు శుభవార్త
- మరో కొత్త పథకం ప్రారంభం
- 100 శాతం సబ్సిడీతో ఉచితంగా పంపిణీ

తెలంగాణలోని రేవంత్ సర్కార్ మహిళలకు శుభవార్త చెప్పింది. వారికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం మరో కొత్త పథకాన్ని ప్రారంభించింది. దీనిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 1000 మంది మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత అర్హులైన మహిళలందరికీ ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయనుంది. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు గాను ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పథకానికి సంబంధించి త్వరలోనే మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానించనుంది. అనంతరం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు మహిళల్లో స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

2 లో

## జనగణన.. సంక్షేమ పథకాలు పోతాయనే భయం వద్దు: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: ప్రజాస్వామ్య దేశంలో గొప్ప కార్యక్రమం జనాభా లెక్కల సేకరణ అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జనగణనలో భాగంగా ఆయన ఆదివారం స్వీయ ధ్రువీకరణ చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనగణనలో తొలిసారి కులగణన జరుగుతోందన్నారు. వివరాలు చెప్తే సంక్షేమ పథకాలు తొలగిస్తారనే భయం వద్దన్నారు. అందరూ ధైర్యంతో వివరాలు ఇవ్వాలని కోరారు.

"ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్‌ను అభినందించాలి. దీని వల్ల నకిలీ ఓట్లు తగ్గించొచ్చు. నకిలీ ఓట్ల తొలగింపుతో పోలింగ్ పర్సంటేజ్ పెరిగింది. హైదరాబాద్‌లో పోలింగ్ పర్సంటేజ్ 50శాతం దాటడం లేదు. ఎస్ఐఆర్ పూర్తయితే ఇక్కడ కూడా పోలింగ్ పర్సంటేజ్ పెరుగుతుంది. తెలంగాణ పర్యటనకు రానున్న ప్రధాని మోదీ.. రైల్వే, జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు"అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సులు నడుపుతాం: మంత్రి పొన్నం



2లో..

## కాంగ్రెస్‌లో కమల్‌హాసన్‌ను మించిన నటులు ఉన్నారు: కేటీఆర్



హైదరాబాద్: 2023 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్ బలం పెరిగిందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. స్కైరూట్ కంపెనీ తాము తెస్తే.. ఈ సీఎం రిబ్బన్ కట్ చేసి గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. "మోసపు హామీలు నమ్మి.. ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. కాంగ్రెస్‌లో కమల్‌హాసన్‌ను మించిన నటులు ఉన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లు ఏమయ్యాయి? మూసీని దుర్గంధం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. రూ.3.70 లక్షల కోట్లు అప్పు చేశానని రేవంత్‌రెడ్డి అంగీకరించారు. దిల్లీకి మూటలు మోయటం తప్ప.. ఆయన చేసిందేమీ లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.

## ఏపీలో డీజిల్, పెట్రోల్ కొరత లేదు: మంత్రి నాదెండ్ల



2లో..

## నిలిచిన ఇంధన సరఫరా.. బంకుల వద్ద బారులు తీరిన వాహనాలు

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 26**



మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపల్లిలో పెట్రోల్ డీజిల్ కొరత ప్రజలను వినియోగదారులను వేధిస్తోంది. లక్కిరెడ్డిపల్లి లోని అనేక బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. జిల్లా కేంద్రం నుండి డీజిల్ పెట్రోల్ సరఫరా కాకపోవడం బంకు యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోలు, డీజిల్ బుక్ చేసిన తర్వాత నాలుగు నుండి ఐదు రోజులకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని యజమానులు తెలుపుతున్నారు.పెట్రోల్ బంకుల ఎదుట వాహనదారులు క్యూ కట్టారు. పెట్రోల్ డీజిల్ కొరత వస్తుందన్న అనుమానంతో వాహనదారులు ఎగబడి క్యాన్లలో సైతం వినియోగదారులు పెట్రోలు నింపుకొని వెళుతున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి డీజిల్ పెట్రోల్ కొరతలేకుండా చూడాలని పెట్రోల్ బంక్ యజమానులు వినియోదారులు ప్రజలు వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## డిండిలో ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు





**జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 26: డిండి :-**

వాసవి కన్యకా పరమేశ్వరి మాత జయంతి వేడుకలను పురస్కరించుకొని నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశ్వర ఆలయ ప్రాంగణంలో కొలువైన వాసవి మాత దేవాలయంలో ఆదివారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.వాసవి మాతకు కుంకుమార్చన,అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాసవి మహిళా సంఘం సభ్యురాలు జూలూరి పద్మ,పోల రాధికతో పాటు ఇతర మహిళలు,వర్తక సంఘం సభ్యులు,వాసవి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని చెన్నకేశవ దేవాలయ చైర్మన్ హనుమాన్ల కేశవులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలంపల్లి లక్ష్మీనారాయణ,ఎలకుర్తి వేణుగోపాల్,ఎలకుర్తి మల్లేష్, ఎలకుర్తి జగన్,జూలూరు వెంకటేష్,పోల వెంకటేష్,కొరివి శేఖర్,నీలా నగేష్,శ్రీధర్, బికుమాండ్ల పరమేశ్వర్,ఎలకుర్తి నవీన్,ఆలంపల్లి రాజు,పోల రాంబాబు తదితరలు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ యాజమాన్యాలకు భారీ షాక్ ఇవ్వనున్న ఏపీ ప్రభుత్వం

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26**





ఏపీలో పెట్రోల్ బంక్ యాజమాన్యాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ షాక్ ఇచ్చేందుకు సిద్ధమయింది. ఇక నుంచి ఉద్దేశపూర్వకంగా పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టించే పెట్రోల్ బంక్ నిర్వాహకులకు భారీ జరిమానా విధించేందుకు సిద్ధమవుతుంది. పద్ధతి మార్చుకోకపోతే పెట్రోల్ బంక్ ను సీజ్ చేసేందుకు వెనకాడబోమని ప్రభుత్వం వార్నింగ్ ఇస్తుంది. యుద్ధం బూచిగా చూపిస్తూ పెట్రోల్, డీజిల్ కొరతను పెట్రోల్ బంకుల నిర్వహకులు సృష్టిస్తున్నారు. పెట్రోల్ , డీజిల్ ను బ్లాక్ మార్కెట్లో విక్రయించుకొని సొమ్ము చేసుకునేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిశాయి. దీంతో ధరలు కూడా పెరుగుతాయని వార్తలు షికారు చేయడంతో పెట్రోల్ బంకుల యాజమాన్యాలు లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయి. వీటన్నిటికీ ఏపీ ప్రభుత్వం చెక్ పెట్టేందుకు కఠిన చర్యలకు సిద్ధమవుతుంది.

## రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పండుగలో వైభవంగా జలాభిషేకం

### రేణుక ఎల్లమ్మ తల్లి -- శక్తి, కరుణ, భక్తి కరుణ బోనాల పండుగతో ఎల్లమ్మ తల్లి అనుగ్రహం

**ఎల్కతుర్తి ఏప్రిల్ 26(జనసముద్రం)**





హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ సంవత్సరం కూడా ఆదివారం నుండి మంగళవారం వరకు ఈ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడుతున్నాయి.పండుగ మొదటి రోజు అయిన ఆదివారం, గ్రామంలోని గౌడ కులస్తులు సంప్రదాయ వేషధారణతో ఊరేగింపుగా వెళ్లి, బిందెలలో నీళ్లు తీసుకుని ఎల్లమ్మ తల్లి దేవస్థానానికి చేరుకుని అమ్మవారికి పవిత్ర జలాభిషేకం చేయించారు. అనంతరం భార్యాభర్తలు కలిసి దేవస్థానంలో పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమ సమర్పించి అమ్మవారిని భక్తి భావంతో అలంకరించారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు గ్రామ పెద్దలు పాల్గొని పండుగ విశిష్టతను వివరించారు. ఎల్లమ్మ తల్లి పండుగ గౌడ కులస్తులకు అత్యంత ఆధ్యాత్మికమైన, సంప్రదాయబద్ధమైన పండుగగా భావిస్తామని తెలిపారు.బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తూ, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. గ్రామంలో ఐక్యత, సంప్రదాయం, భక్తి పరంపరలను నిలబెట్టే ఈ పండుగ మరింత వైభవంగా కొనసాగాలని గ్రామస్తులు ఆకాంక్షించారు.

# పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సులు నడుపుతాం: మంత్రి పొన్నం

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర వ్యాప్తంగా రహదారి సౌకర్యం ఉన్న ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సులను నడుపుతూ ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపైన ఉప్పునుంతల మండల పరిధిలోని డిండికట్ట మైసమ్మ ఆలయ కొత్త పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డా.వంశీకృష్ణతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఇంకా బస్సులు వెళ్లని గ్రామాలను గుర్తించి బస్సుల్ని నడుపుతామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికీ సమాన న్యాయం కల్పిస్తున్నామన్నారు. మహిళాభివృద్ధిని కోరి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిని కాంక్షించి పాలకమండలి పనిచేయాల్సి ఉందన్నారు. దేవాలయ చరిత్రలో మొదటి పాలకమండలి ఇదే అన్నారు. రూ.10 కోట్లతో పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో డిండి డ్యాంలో బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారిపైన ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు ఎడ్ల నరేష్‌యాదవ్, సభ్యులతో దేవాదాయ శాఖ అధికారి మదన్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, నాయకులు కట్టా అనంతరెడ్డి, నర్సింహారావు, జగత్‌రెడ్డి, సీహెచ్.శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కాశన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**డ్రైవర్‌పై దాడి.. స్పందించిన పొన్నం**

బస్సు ఆపలేదని నల్గొండ వద్ద డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటనపై మంత్రి పొన్నం స్పందించారు. దీనిపై జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడి విచారణకు ఆదేశించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఏపీలో డీజిల్, పెట్రోల్ కొరత లేదు: మంత్రి నాదెండ్ల

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఏపీలో డీజిల్, పెట్రోల్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సరఫరాలో వచ్చిన లోపాల వల్లే బంకులు మూతపడుతున్నాయని స్పష్టం చేశారు. ఇంధనానికి లోటు లేదని.. ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు. సమాచార, ప్రసార మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు వివరాలు తెలపాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. పలు చోట్ల కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని.. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరఫరా చైన్ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఆయిల్ డిపోలను జిల్లా అధికారులు నిత్యం పరిశీలించాలన్నారు. ప్రైవేట్ ఆయిల్ కంపెనీల డిపోలు, అవుట్‌లెట్‌లనూ తనిఖీ చేయాలని ఆదేశించారు. బంక్‌ల వద్ద గొడవలు జరగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

కొన్ని ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయని ఎంపీ పురందేశ్వరి అన్నారు. అనవసరంగా పెట్రోల్ కొరత వాతావరణం కలిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఎక్కడికక్కడ నిఘా పెంచాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు జరపాలని సూచించారు.

## ఏపీలో పలు బంకుల మూసివేత..

మొదటిపేజీ తరువాయి

కొరత ఉందనే ఆందోళనతో కొనుగోళ్లు భారీగా పెరిగాయని అధికారులు తెలిపారు. శనివారం 10,345 కిలో లీటర్ల పెట్రోల్.. 14,156 కిలో లీటర్ల డీజిల్ అమ్మకం జరిగినట్లు అధికారులు వివరించారు. సాధారణ అమ్మకం కంటే ఒక్కసారిగా 50శాతం అమ్మకాలు పెరగడంతో బంకుల్లో నిల్వలు అయిపోతున్నాయని, అధికారులు వివరించారు. ఆక్వారైతులు డ్రమ్ముల్లో కొనుగోళ్లు జరుపుతారని వారికి పెట్రో ఉత్పత్తులు విక్రయించే విషయంలో సమస్య తలెత్తుతోందన్నారు. పరిష్కారం చూపేందుకు కలెక్టర్లు, ఫిషరీస్ శాఖ అధికారులు వెంటనే కార్యాచరణ అమలు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు తీసుకున్న చర్యలు, సమస్య పరిష్కారంపై సాయంత్రంలోగా తనకు నివేదిక ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు.

నాదెండ్ల వీడియో కాన్ఫరెన్స్

సీఎం ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్ కన్నబాబు చమురు కంపెనీలు, డీలర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇబ్బంది సమయంలో కంపెనీలు సమర్థంగా పని చేయాలని కోరారు. ఎక్కడా సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. కొరత సృష్టించి వినియోగదారులకు అసౌకర్యం కలిగించడం తగదన్నారు. సరఫరా విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని, అధిగమించాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందని చెప్పారు. చమురు కంపెనీల డిపోల వద్దకు వెళ్లి జేసీలు తనిఖీలు చేపట్టాలని సూచించారు. సరఫరాలో ఎక్కడా ఆలస్యం లేకుండా పర్యవేక్షించాలన్నారు.

## 'ఆ ఏడుగురిపై వేటు వేయండి'.. రాజ్యసభ ఛైర్మన్‌కు 'ఆప్' వినతి




దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఒకేసారి భాజపాలోకి ఫిరాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ఎంపీల చర్యలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు.

"ఆ ఏడుగురు ఎంపీలు ఆప్ నుంచి రాజ్యసభలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత పార్టీని వీడి భాజపా చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో వారి సభ్యత్వాలను రద్దు చేయాలని రాజ్యసభ ఛైర్మన్‌ను కోరాం. ఇటువంటి ఫిరాయింపులు ప్రజాతీర్పునకు ద్రోహం చేయడమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం" అని సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై తాము రాజ్యాంగ నిపుణులను సంప్రదించామని.. చట్టప్రకారం ఆ ఎంపీలు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

భాజపాలోకి ఫిరాయించిన ఆప్ ఎంపీల్లో ఒకరైన హర్భజన్ సింగ్‌కు గతంలో కేటాయించిన భద్రతను పంజాబ్ పోలీసులు ఉపసంహరించుకున్నట్లు సమాచారం. 9- 10 మంది పోలీసులతో కూడిన సెక్యూరిటీని తొలగించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే జలంధర్‌లోని ఛోటీ బారాదరీ ప్రాంతంలో ఉన్న హర్భజన్ నివాసం వద్ద సీఆర్పీఎఫ్ భద్రతను మోహరించారు. భాజపాలోకి వెళ్లడాన్ని నిరసిస్తూ శనివారం ఆప్ కార్యకర్తలు హర్భజన్ నివాసం వద్ద ఆందోళన చేపట్టారు.

# టీఎంసీ ఉన్నంతకాలం

### బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదు: మోదీ

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో తరచుగా బాలికలు అదృశ్యమవుతున్న కేసులు నమోదు అవుతున్నాయని మోదీ పేర్కొన్నారు. అయినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిద్రపోతోందని మండిపడ్డారు. మహిళలతో పాటు రైతులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్రంలో భాజపా కృషి చేస్తోందన్నారు. అందుకే గత 11ఏళ్లలో జనపనార కనీస మద్దతు ధరల(మీఎస్పీ)ను రెట్టింపు చేసిందన్నారు. గోధుమలు, బియ్యం కోసం 100 శాతం జనపనార ప్యాకేజింగ్‌ను తప్పనిసరి చేశామని వెల్లడించారు. హుగ్లీ నది పరిసరాల్లో ఒకప్పుడు మిల్లులు, ఫ్యాక్టరీలు అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటన్నిటినీ మూసివేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వాటిని తిరిగి తెరిపిస్తామన్నారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్ అభివృద్ధి చెందాలంటే తాము అధికారం చేపట్టాల్సిందేనన్నారు

# ప్రతి ఫైల్‌కు పాస్‌వర్డ్:

### టీసీఎస్ నాసిక్ ప్రధాన నిందితుడి జాగ్రత్తలు

మొదటిపేజీ తరువాయి

దీంతో నిందితుడిని స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ నాసిక్‌లోని రీజనల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు.

"డిజిటల్ ఆధారాలను సంపాదించడంలో దర్యాప్తు బృందాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా వరకు ఎలక్ట్రానిక్ పరికరాలకు పలు పాస్‌వర్డ్‌లు ఉన్నాయి. దీంతో వాటిని యాక్సెస్ చేయడానికి ఫోరెన్సిక్ సహాయం కోరాము" అని ఏసీపీ సందీప్ మిట్కే వెల్లడించారు.

మహారాష్ట్రలోని నాసిక్ టీసీఎస్ కార్యాలయంలో లైంగిక వేధింపులు, మతమార్పిడికి ఒత్తిళ్ల కేసులో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బాధితురాళ్లు పోలీసుల విచారణలో వెల్లడిస్తున్న వివరాలు అక్కడ కొనసాగిన కీచకపర్వాన్ని బట్టబయలు చేస్తున్నాయి. హిందూ మతంతో పాటు, దేవుళ్లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, తమతో అసభ్యకరంగా ప్రవర్తించడం, బురఖా ధరించాలని ఒత్తిడి చేయడం.. ఇలా నిందితుల నుంచి తమకు అనేక రకాలుగా వేధింపులు ఎదురైనట్లు బాధితురాళ్లు చెబుతున్నారు. గతేడాది వివాహం చేసుకొని టీసీఎస్‌లో చేరిన ఓ బాధితురాలు తన వాంగ్మూలంలో పేర్కొన్న విషయాలు బయటికొచ్చాయి. దీనిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా తీవ్రంగా స్పందించారు. నిందితులను వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు.

## దీదీ, మోదీ దొందూదొందే



సెరాంపోర్, దిల్లీ:: పేదలను కాదని ధనికులకు సాయమందించడంలో, అధికారం కోసం అంగలార్చడంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీలది ఒకే ధోరణి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ శనివారం విమర్శించారు. హుగ్లీ జిల్లా సెరాంపోర్‌లో ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి రాహుల్ ప్రసంగిస్తూ "మోదీ తనను తాను దేశభక్తునిగా చెప్పుకుంటారు కానీ దేశాన్ని అమ్మేస్తున్నారు" అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ధనికులకు అండగా నిలుస్తున్నారే తప్ప పేదలకు కాదని, కేంద్రంలో మోదీది కూడా అదే తంతు అని రాహుల్ విమర్శించారు.

అది రాష్ట్రీయ సరెండర్ సంఘ్

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరెస్సెస్‌ను రాష్ట్రీయ సరెండర్ సంఘ్‌గా అభివర్ణించారు. అమెరికాలో ఆరెస్సెస్ సీనియర్ నేత రామ్ మాధవ్ చేసిన వ్యాఖ్యలు ఆ సంస్థ అసలు స్వరూపాన్ని బయటపెట్టాయని చెప్పారు. ఇటీవల ఓ కార్యక్రమంలో రామ్ మాధవ్ మాట్లాడుతూ.. అగ్రరాజ్యంతో స్నేహం కోసం భారత్ కొన్ని త్యాగాలు చేసిందని, విపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, ఇరాన్, రష్యా నుంచి చమురు కొనడం ఆపేసినట్లు వెల్లడించారు. అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లను స్వీకరించాల్సి వచ్చిందన్నారు. ఈ వీడియోపై 'ఎక్స్' వేదికగా రాహుల్ స్పందించారు. ఆరెస్సెస్ నేతలు నాగ్‌పుర్‌లో కూర్చొని జాతీయవాదం గురించి మాట్లాడతారని, అమెరికాలో ఆ దేశానికి విధేయంగా ఉంటారని దుయ్యబట్టారు. తర్వాత మాధవ్ క్షమాపణలు చెబుతూ.. తాను చెప్పింది వాస్తవ విరుద్ధమని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజీపుర్‌లో ఒక బాలిక హత్యాచారంపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని రాహుల్ డిమాండ్ చేశారు.

## రేవంత్ సర్కార్ శుభవార్త..



మొదటిపేజీ తరువాయి

మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడాలనే లక్ష్యంతో ఈ పథకం మొదలుపెట్టినట్లు ఆయన తెలిపారు.

**బీసీ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ**

కుట్టు మిషన్ల పంపిణీతో పాటు ఆసక్తి కలిగిన బీసీ మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి స్వయంగా ఉపాధి కల్పించనున్నారు. దీనిలో భాగంగా మహిళలకు ఆటోమేటిక్ కుట్టు యంత్రాలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఈ పథకం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది మహిళలు స్వయం ఉపాధి పొందటంతో పాటు వారు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.కలెక్టర్ల పర్యవేక్షణలో లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. కుట్టు మిషన్లు పంపిణీ చేయడమే కాకుండా మహిళలకు అవసరమైన ఇతర వనరులను సమకూర్చనున్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. కుట్టు మిషన్లు పొందిన మహిళలకు డిజైనింగ్, ఇతర పనుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

# ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరు శ్రీనివాస రామానుజన్ : నవులూరి శివారెడ్డి

**జనసముద్రంన్యూస్, మాచర్ల, ఏప్రిల్ 26;**
గణిత మేధావుల్లో శ్రీనివాస్ రామానుజన్ ఒకరు అని మాచర్ల జయభారత్ నేషనల్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నవులూరి శివారెడ్డి అన్నారు. మే 26వ తేదీన ఆయన వర్ధంతి జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుందని శివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రామానుజన్ కు ఘన నివాళులు అర్పించి శివారెడ్డి మాట్లాడుతూ.. అపారమైన తన గణిత పరిజ్ఞానంతో భారతీయ ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పిన రామానుజన్ అతి చిన్న వయసులోనే అనారోగ్యంతో తన 33వ ఏట 1920 ఏప్రిల్ 26న కుంభకోణంలో కన్నుమూశారన్నారు.

1887, డిసెంబరు 22న తమిళనాడులోని ఈరోడ్‌లో జన్మించిన రామానుజన్, చిన్నతనం నుండి గణితంలో అసాధారణమైన ప్రతిభను ప్రదర్శించాడు. గణితంలో ఎటువంటి శాస్త్రీయ శిక్షణ లేకపోయినా, జి.ఎస్.


శ్రీనివాస్ రామానుజన్

కార్ రాసిన పుస్తకం ఆధారంగా స్వయంగా గణితాన్ని అభ్యసించి, అప్పటికే పరిష్కారం కావు అనుకున్న అనేక సమస్యలను పరిష్కరించారని, 1913లో మద్రాసు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డాక్టర్ వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యం చెంది ఆయన వాటిని కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్టీకి పంపాడని, రామానుజన్ పరిశోధన


నవులూరి శివారెడ్డి

ఫలితాలను చూసిన హార్టీ, ఆయనను కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారని, 1914 మార్చిలో లండన్ వెళ్లిన రామానుజన్ అక్కడ నిరంతరం గణితంపై పరిశోధనలు చేసి 32 పరిశోధనా పత్రాలను సమర్పించాడని, అతను 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను హార్డీకి వివరించి, ఆశ్చర్యచకితుణ్ణి చేశాడని, ఆయన రూపొందించిన 'మాక్ థీటా ఫంక్షన్లు', 'రామానుజన్ ప్రైమ్' వంటివి నేటికీ ఆధునిక భౌతికశాస్త్రంలో (స్ట్రింగ్ థియరీ) ఉపయోగపడుతున్నాయని శివారెడ్డి అన్నారు.

ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారని, ఐదేళ్ల అనంతరం బ్రిటన్ నుంచి 1919 మార్చిలో స్వదేశానికి తిరిగి వచ్చిన రామానుజన్ అనారోగ్యంతో 1920 ఏప్రిల్ 26న మరణించారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తున్నాను అని శివారెడ్డి తెలిపారు.

# రఘుదేవపురంలో విడని "బహిరంగ మలవిసర్జన"

**తూర్పుగోదావరి/సీతానగరం/ఏప్రియల 26/ జనసముద్రం న్యూస్ :**
సీతానగరం మండలంలోని రఘుదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలో 'బహిరంగ మలవిసర్జన' సమస్య విడలేదు. స్థానిక పంచాయతీ పరిధిలోని రవీంద్ర కాలనీ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఇటుక బట్టీలు నిర్వహణ జరుగుతుంది. ఆ ప్రాంతం నాలుగు లైన్ల రహదారిని అనుకొని ఉంది. ఈ రహదారిలో బహిరంగ మలవిసర్జన జరగటం కారణంగా వాహనదారులకు, పాదచారులకు దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామపంచాయతీ కార్యదర్శికి ఈ విషయం తెలిపిన, తగిన చర్యలు తీసుకోకపోవడం పై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిగా స్వయంగా మండల



ఎంపీడీవో అయ్యే ఉన్నందున వేంటనే చర్యలు తీసుకోని, అక్కడ వారితో చర్చించి, బహిరంగ మలవిసర్జన పై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మొగల్తూరులో సర్కారీ స్థలం కబ్జా

**అధికారుల నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు**

**మొగల్తూరు ఏప్రిల్ 26 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**
పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ఆదర్శ్ కాలనీ వద్ద శివాలయం రోడ్ లో ఆక్రమణలు కట్టలు తెంచుకున్నాయి. సుమారు రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఏడడుగుల మేర ఆక్రమించి కమర్షియల్ షెడ్లు ఏర్పాటు చేసి మరోవైపు పంట భోజనం సైతం కబ్జా చేసేస్తున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం కనీసం ఆపే ప్రయత్నం చేయకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఆదర్శ్ కాలనీలోనే గ్రామ సచివాలయం కూడా కొలువుదీరి ఉంది సచివాలయ సిబ్బంది కూడ అటువైపు చూడడం లేదని కాలనీవాసులు చెప్తున్నారు. ఇటువంటి వ్యవహారాలను గాలికి వదిలేయడం వల్ల వాహనాలు తప్పుకునే అవకాశం లేనందున రహదారి గుండా ప్రయాణించే ప్రయాణికులకు ప్రమాదాలు జరిగాయి



ప్రమాదం ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు మౌనం వీడి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ఆధునికీకరణ కోసం ఎదురుచూస్తున్న పంటకాలువ

**నరసాపురం ఏప్రిల్ 26 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**
పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గం సుమారు 20 కిలోమీటర్లు ఆవరించి ఉన్న బ్రిటిష్ కాలం నాటి ప్రధాన పంట కాలువ వేసవి సందర్భంగా కాలువలు ద్వారా సరఫరా చేసే సాగునీరు ప్రస్తుతం నిలుపుదల చేసిన నేపథ్యంలో పంట కాలువ ఆదునికీకరణ కొరకై కాలవపై ఆధారపడిన రైతుల్లో ఆశలు మొదలయ్యాయి. దాల్వా ప్రారంభ దశలో ప్రధాన పంట కాలువ లో చెత్త పేరుకుపోయి నీటి ఎద్దడి ప్రారంభమైన నేపథ్యంలో అప్పుడు కాలువలో నీరు ఉండడం వల్ల స్థానిక ఎమ్మెల్యే చొరవ తో చెత్తను మాత్రమే తొలగించిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేసవి సందర్భంగా కాలవ తవ్వకాలు ప్రారంభమవుతాయని రైతుల్లో ధీమా వ్యక్తం అవుతుంది.



# టైపు రాష్ట్ర మొదటి ర్యాంకర్ సిహెచ్.పి.వి. నాగస్వాతి'కి అవార్డు ప్రధానం మరియు సన్మాన కార్యక్రమం

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 26**
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ టైపు పరీక్షా ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో ఇంగ్లీషు హయ్యర్ గ్రేడ్ నందు మొదటి ర్యాంకు సాధించిన టైపు విద్యార్థిని సి.హెచ్.పి.వి నాగ స్వాతి'ని ఆంధ్ర ప్రదేశ్ టైప్ రైటింగ్ మరియు షార్ట్ హ్యాండ్ ఇన్స్టిట్యూట్ అసోసియేషన్ వారు గుంటూరు బ్రాడీపేట్ 2/7 సి.పి.యం ఆఫీసు ఫంక్షన్ హాలు నందు ర్యాంకును ప్రధానం చేసి, ఒమేగా టైపు ఇన్స్టిట్యూట్ -- గోరంట్ల తరపున సన్మానించినట్లు ప్రిన్సిపాల్ పి. శ్రీనివాసరావు తెలియజేసారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా జె. ఉషారాణి ప్రిన్సిపాల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల -- గుంటూరు హాజరై విద్యార్థులకు సాధారణ విద్యార్హతలతో పాటుగా ప్రత్యేక అర్హత సాంకేతిక నైపుణ్యాలపై పట్టును పెంచుకోవడం ద్వారా విద్యార్ధి దశ పూర్తయ్యే లోపే ఉద్యోగం సాధించవచ్చు అని తెలిపారు. అనంతరం పి. శంకరరావు , సి.సి.పి విభాగాదిపతి ప్రిన్సిపాల్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల -- గుంటూరు మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో టైప్ రైటింగ్ నేర్చుకోవడం ద్వారా కంప్యూటర్ వినియోగం పై అవగాహన పెరిగి




టెక్నాలజీ వాడే విధానాన్ని సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ టైప్ రైటింగ్ మరియు షార్ట్ హ్యాండ్ ఇన్స్టిట్యూట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ టైపు నేర్చుకుని కంప్యూటర్ పై వేగంగా టైపు చేసేవారికి కోర్టు, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమీషన్ మరియు అడ్మినిస్ట్రేషన్ శాఖల్లో ఉద్యోగావకాశాలు అపారంగా ఉన్నాయన్నారు. ఈ ర్యాంకు ప్రదానోత్సవం మరియు సన్మాన కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ టైప్ రైటింగ్ మరియు షార్ట్ హ్యాండ్ ఇన్స్టిట్యూట్ అసోసియేషన్ విశిష్ట అతిధి మోహనరావు మరియు అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర వ్యాప్తంగా విచ్చేసిన టైపు ప్రిన్సిపల్ , ర్యాంకు సాధించిన టైపు విద్యార్థులు, ఒమేగా టైపు ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ పల్లెకొండ శ్రీనివాసరావు , తోటి టైపు




విద్యార్థులు మరియు తల్లితండ్రులు పాల్గొన్నారు.

# వై.ఎన్. కళాశాల అభివృద్ధికి అంతా కృషి చేయాలి

**కొవ్వలి రామ్మోహన్ నాయుడు**

**నరసాపురం ఏప్రిల్ 26 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**
పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని ప్రసిద్ధ వై.ఎన్. కళాశాల పాలకవర్గ ఎన్నికల పోలింగ్ ఆదివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును



వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యా రంగంలో ఎంతో ఘన చరిత్ర కలిగిన వై.ఎన్. కళాశాల అభివృద్ధికి ఈ ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. పాలకవర్గ ఎన్నికల్లో గెలుపొందే సభ్యులంతా వ్యక్తిగత ప్రయోజనాల కంటే కళాశాల పురోగతికే ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా కృషి చేయాలని ఆయన



ఆకాంక్షించారు. రామ్మోహన్ నాయుడు ఓటు వేసేందుకు వచ్చిన సమయంలో ఆయన వెంట పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొనీ వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ద్వారకాతిరుమలలో కళ్యాణ వైభవం... పెళ్లి కుమారుడిగా ముస్తాబైన చినవెంకన్న..


శ్రీమహావిష్ణు అలంకారంలో శ్రీవారు.


**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఏప్రిల్ 26 ద్వారకాతిరుమల ప్రతినిధి.**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో వైశాఖమాస తిరుకళ్యాణ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. క్షేత్ర సంప్రదాయం ప్రకారం ఉదయం నుంచే ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా శ్రీ స్వామివారిని మొదటిరోజు శ్రీమహావిష్ణువు అలంకారంలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. శంఖు, చక్ర, గదాధారియై సాక్షాత్తు ఆ వైకుంఠనాథుడే దిగివచ్చాడా అన్నట్లుగా ఉన్న స్వామివారి రూపం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం శుభ



ముహూర్తాన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పెళ్లి కుమారుడిగా, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. ఈ వేడుక కోసం కళ్యాణ మండపాన్ని రంగురంగుల పచ్చి పూలతో కనుల పండువగా ముస్తాబు చేశారు. ప్రకృతి సిద్ధమైన పుష్పాల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళవాయిద్యాల నడుమ, వేద పండితుల మంత్రోచ్చారణలతో ఈ వేడుక కనుల పండువగా సాగింది. కళ్యాణోత్సవాలు ప్రారంభం కావడంతో ద్వారకాతిరుమల క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ ఈవో కళా వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. ఈవో జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరికాయ కొట్టి ఈ వేడుకలను మొదలుపెట్టారు. ఉత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు ప్రముఖ కళాకారులచే అన్నమయ్య సంకీర్తనలు, హరికథలు మరియు కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించనున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థాన అధికారులు, సిబ్బంది విస్తృత ఏర్పాట్లు చేశారు. రానున్న వారం రోజుల పాటు ఆలయంలో వివిధ వాహన సేవలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, అర్చకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# ద్వారకాతిరుమలలో ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జన్మదినోత్సవం.

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఏప్రిల్ 26 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండప దేవాలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారి జన్మదినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తెల్లవారుజాము నుండే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణలు చేసి భక్తిశ్రద్ధలతో కొలిచారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో శ్రీ వాసవి హోమం అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం, భక్తుల సుఖసంతోషాల కోసం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణాహుతితో ఈ హోమం ముగిసింది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు, ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు మరియు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు 'సాధన మహిళా మండలి' చేయూత





**తూర్పుగోదావరి /సీతానగరం/ ఏప్రియల్ 26/జనసముద్రం న్యూస్ :**
అడ్డతీగల మండలంలోని కోనలోవ గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఐదు గిరిజన కుటుంబాలను 'సాధన మహిళా మండలి' స్వచ్ఛంద సంస్థ ఆదుకుంది. సంస్థ చైర్‌పర్సన్ పి. సుజ్ఞాన కుమారి బాధితులను పరామర్శించి, వారికి తక్షణ సాయంగా ప్రతి కుటుంబానికి ఒక బస్తా బియ్యం, ?20 రకాల నిత్యావసర వస్తువులతో కూడిన కిట్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ ఎం.పి.డి.ఓ పి.వెంకటరత్నం ముఖ్య అతిథిగా పాల్గొని సంస్థ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు ఎం. సుబ్బారావు, వేమగిరి అర్జున్, పాస్టర్ ప్రభు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బండి ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

**మొగల్తూరు ఏప్రిల్ 26 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**
మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. నరసాపురం పట్టణానికి చెందిన తెలగంశెట్టి దుర్గారావు, వెంకట శేషవేణి దంపతులు రూ.51, 116లు విరాళం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి . యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో అరుణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ యం జగదీష్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.





# నెల్లూరులో డా. అగర్వాల్స్ ఐ హాస్పిటల్ ఆధునిక కంటి వైద్య కేంద్రం ప్రారంభం

**అత్యాధునిక నిర్ధారణ, శస్త్రచికిత్స సాంకేతికతతో సమగ్ర కంటి చికిత్స సేవలు**

**ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మే 31, 2026 వరకు ఉచిత కంటి పరీక్షలు**

**నెల్లూరు, ఏప్రిల్ 26, జనసముద్రము జిల్లా ప్రతినిధి**





గత దశాబ్దంగా నెల్లూరు ప్రజలకు ప్రపంచ స్థాయి కంటి వైద్య సేవలు అందిస్తున్న డా. అగర్వాల్స్ ఐ హాస్పిటల్, ఇప్పుడు అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనానికి మారింది. పోదలకూరు లక్ష్మీ మస్తానయ్య కాంప్లెక్స్, రవీంద్రనగర్, మినీ బైపాస్ రోడ్‌లో కొత్త ఆసుపత్రి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ సదుపాయంలో కాటరాక్ట్, గ్లాకోమా, రెటినా, కార్నియా, రిఫ్రాక్టివ్, ఆక్యులోప్లాస్టిక్ వంటి అన్ని రకాల కంటి చికిత్సలు అందుబాటులో ఉంటాయి. రోజువారీగా ఎక్కువ మంది రోగులకు సేవలు అందించే సామర్థ్యాన్ని ఈ కేంద్రం నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మేయర్ ఎన్ భాను శ్రీ, టిడిపి నాయకులు బెజవాడ మున్సీ రెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డి, అగర్వాల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు. వైద్య నిపుణులుగా డా. రమ్య సంపత్, డా. శివ ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. 2016 ఆగస్టులో ప్రారంభమైనప్పటి నుంచి ఈ ఆసుపత్రి రెండు లక్షలకు పైగా రోగులకు చికిత్స అందించింది. కొత్త కేంద్రంలో రెటినా శస్త్రచికిత్స యూనిట్ వంటి అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేయడం ద్వారా నిర్ధారణ, చికిత్స సామర్థ్యం మరింత పెరిగింది. ఆసుపత్రి విస్తరణతో అత్యాధునిక వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించాలన్న లక్ష్యం ముందుకు సాగుతోందని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా మే 31, 2026 వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత సమగ్ర కంటి పరీక్షలకు నమోదు కోసం 9594902146 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, "గత 10 ఏళ్లుగా డా. అగర్వాల్స్ ఐ హాస్పిటల్ నెల్లూరులో ఆరోగ్య రంగానికి కీలక సేవలు అందిస్తోంది. కొత్త కేంద్రం ప్రారంభం ప్రజలకు ప్రపంచ స్థాయి కంటి చికిత్సలను మరింత చేరువ చేస్తుంది" అన్నారు. 40 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన డా. శివ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, "ఆధునిక సాంకేతికతతో కూడిన ఈ నూతన సదుపాయం ద్వారా విభిన్న కంటి సమస్యలకు అత్యుత్తమ చికిత్స అందించగలుగుతున్నాం. రెటినా శస్త్రచికిత్స వంటి సదుపాయాలు మా సేవలను మరింత బలోపేతం చేస్తాయి. రోజుకు మరింత మంది రోగులకు సేవలు అందించేందుకు ఇది సహకరిస్తుంది" అని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నెల్లూరు మరియు పరిసర ప్రాంతాల వైద్యులు, ఆరోగ్య నిపుణులు, ఆహ్వానితులు హాజరయ్యారు.

**డా. అగర్వాల్స్ ఐ హాస్పిటల్ గురించి:**

విస్తీర్ణ పరంగా మాత్రమే కాకుండా, కంటి వైద్య రంగంలో వినూత్న ఆవిష్కరణలకు డా. అగర్వాల్స్ ఐ హాస్పిటల్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఆసుపత్రి వైద్యులు అభివృద్ధి చేసి, మొదటిసారిగా అమలు చేసిన అనేక శస్త్రచికిత్స విధానాలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కంటి వైద్య నిపుణులు అనుసరిస్తున్నారు.

వాటిలో ముఖ్యంగా 'గ్లూడ్ ఇంట్రాక్యులర్ లెన్స్ (+శ్రీబవను ×ూూ)' శస్త్రచికిత్స -- సహజ లెన్స్‌కు అవసరమైన కాప్సులర్ సపోర్ట్ లేకపోయినప్పుడు లేదా దెబ్బతిన్నప్పుడు స్యూటర్ అవసరం లేకుండా చేసే ఆధునిక విధానం; 'ప్రీ-డెస్మెటిస్ ఎండోథీలియల్ కెరాటోప్లాస్టీ (ూణజుఖ)' -- స్యూటర్ లేని కార్నియా మార్పిడి విధానంలో కీలక పురోగతి; 'సింగిల్-పాస్ ఫోర్-త్రో (ూఖీ) ప్యూపిలోప్లాస్టీ' -- పెద్ద లేదా దెబ్బతిన్న ప్యూపిల్‌ను కట్లెలు లేకుండా సురక్షితంగా సరిచేసే పద్ధతి; 'పిన్‌హోల్ ప్యూపిలోప్లాస్టీ (ూూూ)' -- అసమాన కార్నియా ఉన్న రోగుల్లో చూపు నాణ్యతను మెరుగుపరచే విధానం; అలాగే 'కార్నియల్ అల్లోజెనిక్ ఇంట్రాస్ట్రోమల్ రింగ్ సెగ్మెంట్స్ (జూూ×=ూ)' -- కెరాటోకోనస్ వంటి కార్నియా వ్యాధుల చికిత్సలో వినియోగించే విధానం ఉన్నాయి.

# శ్రీవారి శాశ్వత నిత్యాన్నదానికి విరాళాలు.



నిత్యాన్నదాన పత్రాన్ని అందజేస్తున్న ఏఈవో మెట్టపల్లి దుర్గారావు.



నిత్యాన్నదాన పత్రాన్ని అందజేస్తున్న సూపర్నెంట్ పద్మావతి.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఏప్రిల్ 26 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు ఆదివారం రూ. 2,04,000/- మద్దూరు వాస్తవ్యులు కూరం శెట్టి వేణుగోపాల్ కుటుంబ సభ్యులు రూ. 1,04,000/- మరొక దంపతులు రాజమండ్రికి చెందిన ఎన్ . హరిహర ప్రవీణ్ కుటుంబ సభ్యులు రూ. 1,00,000/-విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దేవస్థానం ఏఈవో మెట్టపల్లి దుర్గారావు, సూపర్నెంట్ ఎం .పద్మావతి దాతలను ప్రత్యేకంగా అభినందించి, స్వామివారి ప్రసాదాలను, నిత్యాన్నదాన బ్రాండ్ పత్రాన్ని అందజేశారు.

# యుద్ధం బి పర్యవసానాలు -భారత్ పై ప్రభావం.

**జనసముద్రం న్యూస్,డాబాగర్డెన్స్, విశాఖపట్నం,ఏప్రిల్27,**



డాబాగార్డెన్స్ లో ఉన్న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ – పర్యవసానాలు – భారత్ పై ప్రభావం అనే అంశం పై సెమినార్ విజ్ఞాన కేంద్రం కోశాధికారి వి ఎస్ పద్మనాభరాజు అధ్యక్షతన జరిగింది. ప్రజాశక్తి డిప్యూటీ ఎడిటర్ వి రాంభూపాల్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ ఇరాన్ పై అమెరికా,ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధం ఆపాలని అన్నారు. యుద్ధం వల్ల భారతదేశం లో ఎగుమతులు నిలిచిపోవడం తో పాటు గ్యాస్ కొరత వలన ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులు ఎదుర్కొంటుందని చెప్పారు. అమెరికా ఆర్థిక సంక్షోభం నుండి బయటపడడానికి ఇరాన్ పై యుద్ధం చేస్తుందని విమర్శించారు. మూడవ ప్రపంచ దేశాల వనరులను దోచుకోవడానికి అమెరికా ముందుకు పోతుంది. ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలు ఉన్న వెనిజులా పై అసత్య ప్రచారం చేసి ఐక్యరాజ్యసమితి సూత్రాలకు విరుద్ధంగా దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడిని, అతడు భార్యను కిడ్నాప్ చేసి అమెరికా జైల్లో కుక్కింది. అలాగే ఇరాన్ లోని చమురు నిలవలపై ఆదిపత్యం సాధించడానికి ఈరోజు అమెరికా ఇజ్రాయిల్ కలిసి యుద్ధం చేస్తుందని అన్నారు. ఇరాన్ పై యుద్ధం వల్ల భారతదేశానికి పెట్రోల్,డీజిల్,గ్యాస్ కి కొరత ఏర్పడిందని దీనివల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మరో ప్రక్క చిన్నమధ్య తరగతి పరిశ్రమలు మూత పడుతున్నాయని ,ప్రధానంగా హోటల్స్ మూతపడటం వల్ల దానిపై ఆధారపడిన అనేక మంది కార్మికులుకు పని పోతుంది అన్నారు. ఇంధన కొరత వలన నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగాయని అన్నారు. ఇరాన్ పై ఈ యుద్ధం కొనసాగితే భారతదేశం మరింత ఆర్థికంగా నష్టపోతుందని, ప్రజలపై మరిన్ని భారాలు పడతాయని అన్నారు. యుద్ధంలో అమాయక ప్రజలు మహిళలు,పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అని అన్నారు. భారత్ ప్రభుత్వం విదేశాంగ విధానాన్ని పక్కకునేట్టి అమెరికాకు లొంగిపోయిందన్నారు. తక్షణం ఇజ్రాయిల్, అమెరికాలు ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని ఆపాలని కోరారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేసి ప్రజల ఆర్థిక కష్టాలు నుండి కాపాడుకోవాలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ సెమినార్ లో ఐద్వా రాష్ట్ర నాయకులు బి.పద్మ, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు తేజ లు ప్రసంగించారు.

# బీసీలకు గుర్తింపు ఇచ్చింది తెలుగుదేశం పార్టీనే -- వడ్డే సిమెంట్ పోలన్న

**జనసముద్రం న్యూస్ అనంతపురం అర్బన్ ఏప్రిల్ 26**




అనంతపురం నగరంలోని తెలుగుదేశం పార్టీ అర్బన్ కార్యాలయంలో టిడిపి బీసీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి వడ్డే సిమెంట్ పోలన్న ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సమాజానికి నిజమైన గౌరవం, ప్రాధాన్యత ఇచ్చింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు రాజకీయ, సామాజికంగా పెద్దపీట వేసిందని, అనేక కీలక పదవులు, అవకాశాలు కల్పించి వారి అభివృద్ధికి కట్టుబడి పనిచేసిందని తెలిపారు. స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి వరకు బీసీలకు అధిక ప్రాతినిధ్యం ఇచ్చిన పార్టీ టిడిపి మాత్రమేనని గుర్తు చేశారు. అదే సమయంలో గత వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, ఆ పాలనలో బీసీలపై అన్యాయాలు, వివక్ష, అవకాశాల లోపం ఎక్కువగా జరిగాయని ఆరోపించారు. బీసీ నాయకులను పక్కన పెట్టడం, కేవలం నామమాత్రపు పదవులు ఇవ్వడం, అసలు కీలక నిర్ణయాధికార పదవులను ఒకే సామాజిక వర్గానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం బీసీ గళం అంటూ మాట్లాడుతున్న వారు గతంలో జరిగిన అన్యాయాలపై ఎందుకు మౌనం వహించారో ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. బీసీలపై కపట ప్రేమ చూపించే ప్రయత్నాలను ప్రజలు గుర్తిస్తున్నారని, ఇక మోసపోవడం లేదన్నారు. బీసీ సమాజం అభివృద్ధి కోసం నిజాయితీగా పని చేసే శక్తి తెలుగుదేశం పార్టీకే ఉందని, భవిష్యత్తులో కూడా బీసీలకు మరింత ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పద్మశాలి అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, నాయి బ్రాహ్మణ అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న, రజక అభివృద్ధి సంక్షేమ సంఘం డైరెక్టర్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్

**అవయవదానం చేసేందుకు అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులు**

**మొగల్తూరు ఏప్రిల్ 26 జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ధనుంజయ్**





పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధి హై స్కూల్ వీధిలో నివాసముంటున్న ఆలపాటి రాజేష్ (31) ఈనెల 22వ తేదీన రాత్రి 216 జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు, నరసాపురం వైద్యుల సిఫారసు మేరకు రాజేష్ ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం బ్రెయిన్ డెడ్ గా ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులతో చర్చించి అవయవదానానికి ప్రేరేపించగా వారి బిడ్డ ఇంక బ్రతికే అవకాశం లేనందున ఇతరుల రూపంలో బ్రతికించుకోవచ్చనే ఆలోచనతో విశాల హృదయంతో వారు అవయవదానానికి అంగీకరించారు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం కొన్ని అవయవాలను వైద్యులు తొలగించి అనంతరం మృతదేహాన్ని సొంత గ్రామమైన మొగల్తూరుకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు కాళీపట్నం నుంచి మొగల్తూరు మృతిని నివాసం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పెద్దలు ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ ఘటన తో మొగల్తూరు గ్రామంలో విషాద ఛాయలు కమ్ముకున్నాయి. తల్లిదండ్రులు బంధువులు స్నేహితులు శోకసముద్రంలో మునిగిపోయారు, తల్లిదండ్రులు ఉన్నతమైన హృదయంతో రాజేష్ అవయవాలను నలుగురికి దానం చేశారు, ( గుండె, కళ్ళు, కిడ్నీలు) దానం చేసినట్టు సమాచారం మొగల్తూరు నుంచి ఇప్పటివరకు అవయవదానం చేసిన కేసులు ఏమి నమోదు కాలేదని ఇదే ప్రథమామని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# ,అధినేని, నారే వారి పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన షపి నాయక్



**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 26**

లక్కిరెడ్డిపల్లి మండలం టౌన్ లోని నారే వీరభద్ర నాయుడు, నారే ఈశ్వరమ్మ కుమార్తె అమ్మణ్ణి కడప వాస్తవ్యులైనటువంటి ఆదినేని వెంకటాద్రి నాయుడు, నాగమణెమ్మ కుమారుడు గణేష్ వివాహానికి లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ షఫీ నాయక్ హాజరై వధూవరుల ఇద్దరిని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో నలంద విద్యానికేతన్ కరస్పాండెంట్ ఏఎస్ బాలసుబ్రమణ్యం మల్లి నాయుడు, రిజ్వాన్, అహ్మద్, గంటా వెంకటకృష్ణ, గోవిందు వెంకటేష్, నాగమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు

# చలమాల. నరసింహులు

**ఐదవ వర్ధంతి సందర్భంగా అన్నదానం**

**రైల్వే కోడూరు జన సముద్రం న్యూస్ ఏప్రిల్ 26(రైల్వే కోడూరు నియోజకవర్గం న్యూస్ ఇంచార్జ్ పాణ్యం లోకేష్ బాబు)**



ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం చిట్వేలు మండలం తుమ్మకొండ గ్రామ వాస్తవ్యులు కీర్తిశేషులు చలమాల నరసింహులు గారి జ్ఞాపకార్థం ఓబులవారిపల్లి మండలం పెద్దఓరంపాడు గ్రామపంచాయతీ పాపిరెడ్డి పల్లె సమీపంలోని అప్పారావు సర్కిల్ కాశీనగరం జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం నందు కీర్తిశేషులు చలమాల నరసింహులు గారి కుమారులు చలమాల పెంచలయ్య (కుమార్)కోడలు లక్ష్మీదేవి దంపతులుకుమారుడు సునీల్ కుమార్ కోడలు అరుణ దంపతులుకుమారుడు రూపేష్మనవాళ్లు మనవరాలు నేహా, విష్ణు, వాసవి. కీర్తిశేషులు చలమాల నరసింహులు గారి కుమార్తెలు: సావిత్రి, ఝాన్సీ, తమ్ముడు శంకరయ్య వీరి తనయుడు చరణ్ తేజ్ కీర్తిశేషులు చలమాల నరసింహులు గారి తోబుట్టువులు చిన్నమ్మ, సరోజమ్మ, గంగమ్మ, కీర్తిశేషులు చలమాల. నరసింహులు గారి సొంత గ్రామం తుమ్మకొండ అగ్రహారం, చిట్వేలు మండలం రైల్వే కోడూరు తాలూకా తిరుపతి జిల్లా కీర్తిశేషులు చలమాల. నరసింహులు గారి ఐదో వర్ధంతి సందర్భంగా జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం నందు అద్భుతమైన అన్నదానం జరిపించి అందరి ఆకలి తీర్చారు ఆ దారిన వెళ్లి బాటసారులు, ఆ దారిన వెళ్లి చిరు వ్యాపారులు మొదలగువారు ఆకలి తీర్చుకున్నారుజీవనజ్యోతి ఆనంద నిలయం ఆశ్రమం నందు ప్రత్యేక అద్భుత అన్నదానం జరిపించారు ఆశ్రమం వర్కింగ్ మేనేజర్ దట్టం రఘురామయ్య వంట ఏజెన్సీ ఆర్గనైజర్ ముంతాజ్ బీబీ చాన్ ఒక ప్రకటనలో పత్రికారంగానికి తెలిపారు.

# జడ్పీ బాయ్స్ హైస్కూల్లో జరిగిన స్వచ్ఛభారత్

**జనసముద్రంన్యూస్, మాచర్ల, ఏప్రిల్ 26;**





శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల వారి ఆధ్వర్యంలో 26.04.2026 ఆదివారం ఏడు గంటల నుండి 10 గంటల వరకు మాచర్ల పిడబ్ల్యుడి కాలనీలో ఉన్నటువంటి జడ్పీ బాయ్స్ స్కూల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు .పరిశుభ్రత లోనే పరమాత్ముడు ఉన్నాడు అన్న మహాత్మా గాంధీ స్ఫూర్తితో ,మానవసేవయే మాధవ సేవ అన్న స్వామి వివేకానంద స్ఫూర్తితో, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యొక్క స్ఫూర్తితో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యొక్క స్ఫూర్తితో ప్రతి ఆదివారం కూడా ప్రభుత్వ ఆఫీసులో, ప్రైవేట్ ఆఫీసులో, స్కూల్స్, కాలేజీలు, దేవాలయాలు, చర్చిలు, మసీదు దగ్గర ఉన్నటువంటి అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశం లో ఉదయం ఏడు గంటల నుండి 10 గంటల వరకు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గోవిందరెడ్డి తెలిపారు. మాచర్ల జడ్పీ బాయ్స్ హై స్కూల్ లో వచ్చే జూన్ నెల నుంచి కేంద్రీయ విద్యాలయం ప్రారంభిస్తున్న సందర్భంగా అధికారుల యొక్క సూచనలతో జడ్పీ బాయ్స్ హై స్కూల్ లోని గ్రౌండ్ను నీటుగా తయారుచేసి ఒక వివేకానంద వనం లాగా ఆ గ్రౌండును తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం జడ్పీ బాయ్స్ హై స్కూల్ లో ఉన్నటువంటి పిచ్చి మొక్కలు, కంప చెట్లు తొలగించి మొత్తం శుభ్రం చేసినట్లు గోవింద రెడ్డి తెలిపారు. కావున ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా శ్రీ రామకృష్ణ సేవా సమితిలో సభ్యులుగా చేరి స్వర్ణాంధ్ర, స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొని మహానుభావులు కలలు కన్న నవభారత నిర్మాణానికి నాంది పలకాలని గోవింద రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో కండ్లకుంట అంగన్వాడీ టీచర్ చెన్నుపల్లి రుక్మిణి, ఎర్రబోతుల నాగ శంకర్ రెడ్డి, సుందరమ్మ, శ్రీను ,మారుతి స్కూల్ విద్యార్థి నీ,విద్యార్థులు, శ్రీరామ కృష్ణ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లాలో పెట్రోల్, డీజిల్ సెగ..





**ద్వారకాతిరుమలలో మూతపడ్డ బంకులు.. కిలోమీటర్ల మేర క్యూలైన్లు.**

**జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఏప్రిల్ 26 ద్వారకాతిరుమల ప్రతినిధి.**

ఏలూరు జిల్లావ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చింది. గత కొన్ని రోజులుగా ఇంధన సరఫరాలో అంతరాయం కలగడంతో సామాన్య ప్రజలు, రైతులు, ఆటో డ్రైవర్లు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఒకదాని వద్ద వందలాది మంది
ద్వారకాతిరుమల మండల కేంద్రంలో మొత్తం మూడు పెట్రోల్ బంకులు ఉండగా, అందులో రెండు బంకులు స్టాక్ లేక 'నో స్టాక్' బోర్డులు పెట్టి మూసివేశారు. కేవలం ఒక్క బంకులో మాత్రమే అరకొరగా ఇంధనం అందుబాటులో ఉండటంతో, గత రెండు రోజులుగా ప్రజలు తెల్లవారుజాము నుండే క్యూలైన్లలో బారులు తీరుతున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితికి పొంతన లేదుఒకవైపు జిల్లా అధికారులు జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రకటనలు జారీ చేస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం బంకులు మూతపడటంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని, వాస్తవ పరిస్థితిని గమనించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అల్లాడుతున్న రైతులు, ఆటో డ్రైవర్లువ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లు, ఇతర యంత్రాలకు డీజిల్ అత్యవసరం కావడంతో రైతులు డబ్బాలతో బంకుల చుట్టూ తిరుగుతున్నారు. రోజూ ఆటో నడిపితే గానీ ఇల్లు గడవని ఆటో డ్రైవర్లు, ఇంధనం దొరక్క ఉపాధి కోల్పోతున్నామని కన్నీరు మునిగవుతున్నారు. క్షేత్రానికి వచ్చే భక్తులు తమ వాహనాల్లో ఇంధనం నింపుకోవడానికి వీలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరియు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పెట్రోల్, డీజిల్ సరఫరాను పునరుద్ధరించి ఈ ఇంధన కష్టాల నుండి గట్టెక్కించాలని ఏలూరు జిల్లా ప్రజలు కోరుతున్నారు.


# లక్కిరెడ్డిపల్లి జమియతే ఇత్తే హదూల్ ఆధ్వర్యంలో ఖత్నా ( వడుగులు ) కార్యక్రమం

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఏప్రిల్ 26**




లక్కిరెడ్డిపల్లి మండలంలోని టౌన్ లోని రహీద్ మస్జిద్ నందు మార్కెట్ యార్డ్ చైర్మన్ సేఫినాయక్ ఆధ్వర్యంలో సున్తీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు లక్కిరెడ్డిపల్లి రామాపురం చక్రాపేట మండలాల నుంచి దాదాపు 110 మంది పైన పిల్లలకు సున్తీ కార్యక్రమాన్ని పది సంవత్సరాల అనుభవం కలిగినటువంటి డాక్టర్ ఇర్ఫాన్ జనరల్ ఫిజీషియన్ మెడికేర్ క్లినిక్ స్పెషల్ హిమజ తెరపి ఉదయం 6. 30గంటల నుంచి 10 గంటల వరకు నిర్వహించారు సుల్తా చేసిన పిల్లల కొరకు మందులు మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ షఫీ నాయక్ సమకూర్చారు

## నేను అలా కనిపించినందుకు క్లాప్స్..
# ఎప్పటికీ మర్చిపోలేను: ధనుష్



'కర' సినిమాతో ప్రేక్షకులను మరోసారి పలకరించేందుకు సిద్ధమయ్యారు కోలీవుడ్ ప్రముఖ నటుడు ధనుష్ . ఆయన హీరోగా విఘ్నేశ్ రాజా తెరకెక్కించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ తెలుగులోనూ ఈనెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం రాత్రి కోయంబత్తూరులో ఓ ఈవెంట్ నిర్వహించారు. ధనుష్ మాట్లాడుతూ.. నిజాయతీగా పని చేశారంటూ 'కర' చిత్ర బృందాన్ని కొనియాడారు. తన గత సినిమా 'పొల్లాధవన్'ను ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు.


### నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్

"పొల్లాధవన్' నా కెరీర్‌లో టర్నింగ్ పాయింట్. బాడీ ఫిట్‌నెస్ విషయంలో.. ఈ సినిమాకి ముందు నన్ను చాలామంది విమర్శించేవారు. దాన్ని ఛాలెంజింగ్ తీసుకున్నా. అలా 'పొల్లాధవన్'లో సిక్స్‌ప్యాక్‌లో కనిపించా. నా శరీరాకృతికి ప్రేక్షకుల నుంచి చప్పట్లు రావడం అదే తొలిసారి. ఆ క్షణాల్ని ఎప్పటికీ మర్చిపోలేను" అని అన్నారు. వెట్రిమారన్ తెరకెక్కించిన యాక్షన్ డ్రామా మూవీ 'పొల్లాధవన్' 2007లో విడుదలైంది. ఆ తర్వాత ఈ హిట్ కాంబినేషన్‌లో 'ఆడుకాలం', 'వడచెన్నై', 'అసురన్' సినిమాలొచ్చాయి.

### అప్పుడే మళ్లీ డైరెక్షన్

"ప్రస్తుతం రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నా. మరోవైపు ముగ్గురు దర్శకులు నాతో సినిమాలు చేసేందుకు వెయిట్ చేస్తున్నారు. నేను ఇంకా 'వడచెన్నై 2' చేయాల్సి ఉంది. ఇవి పూర్తయ్యాకే మళ్లీ డైరెక్షన్ చేస్తా" అని తెలిపారు. 'రాయన్', 'ఇడ్లీ కొట్టు'లాంటి సినిమాలకు ధనుష్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. తదుపరి ఆయన లేడీ ఓరియెంటెడ్ మూవీ తెరకెక్కించనున్నారని, అందులో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ అని ఇటీవల ప్రచారం జరగడం గమనార్హం.

## తమిళ చిత్ర నిర్మాతల సంచలన నిర్ణయం..
## నటీనటులు ఒప్పుకొంటారా?



తమిళ చిత్ర నిర్మాతల మండలి సంచలన నిర్ణయం తీసుకుంది. భారీ బడ్జెట్‌తో రూపొందించే చిత్రాల నిర్మాణం విషయంలో మార్పులు చేపట్టబోతోంది. ఆదివారం జరిగిన తమిళ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) మీటింగ్‌లో ఈ మేరకు తీర్మానం చేసింది. భారీ బడ్జెట్‌లో రూపొందించే చిత్రాల్లో నటించే నటీనటులకు పారితోషికాలను రెవెన్యూ షేరింగ్ మోడల్‌లో అందించనున్నారు. ప్రస్తుతం నటీనటులు, సాంకేతిక నిపుణులకు వారి ప్రతిభ, క్రేజ్, డిమాండ్‌ను బట్టి పారితోషికాన్ని నిర్ణయిస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద జయాపజయాలతో సంబంధం లేకుండా ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ మొత్తాన్ని చెల్లించాల్సిందే. ఈ పద్ధతికి త్వరలోనే చరమగీతం పాడనున్నారు. నిర్మాతతో పాటు, సినిమా లాభనష్టాలను నటీనటులు కూడా పంచుకోవాల్సిందే.మే 2న టీఎఫ్‌పీసీ ఒక రోజు సమ్మెను ప్రకటించింది. త్వరలో నిర్మాణపరంగా జరగబోయే మార్పులకు దీన్ని నాందిగా కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. రెవెన్యూ షేరింగ్ మోడల్ విషయంలో నడిగర్‌సంఘం సహకారం అందించకపోతే, ఒక రోజు సమ్మె కాస్తా పూర్తి సమ్మెగా కొనసాగవచ్చని అంటున్నారు. దీని వల్ల తమిళ మూవీ ప్రొడక్షన్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే థియేట్రికల్ రన్ పూర్తయిన తర్వాత సినిమాలను ఓటీటీలో విడుదల చేసే విషయంలో కౌన్సిల్ మరో తీర్మానం చేసింది. విడుదలైన 6 నుంచి 8 వారాల పాటు సినిమాలను ఓటీటీలో స్ట్రీమింగ్‌కు తీసుకురావడానికి వీల్లేదని నిర్ణయించింది. మిడ్ రేంజ్ సినిమాలకు ఆరు వారాల గడువు ఉండగా, భారీ బడ్జెట్ చిత్రాలు కచ్చితంగా 8 వారాలు ఆగాల్సిందే.రెవెన్యూ షేరింగ్ మోడల్‌ను టీఎఫ్‌పీసీ ప్రతిపాదించడం ఇదే తొలిసారి కాదు. 2025లోనూ ఇదే నిర్ణయం తీసుకున్నారు. కమల్‌హాసన్, విజయ్, అజిత్, సూర్య, ధనుష్, శివకార్తికేయన్, శింబు, విశాల్ సహా కీలక నటీనటులను ఈ మోడల్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయినా పెద్దగా స్పందన రాలేదు. ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన 'పరాశక్తి' విషయంలో నిర్మాత ధనుంజయ ఈ విధానాన్నే అనుసరించారు. ఇందులో నటించిన శివకార్తికేయన్, జయం రవి వంటివారు రెవెన్యూ షేరింగ్ మోడల్‌కు ఓకే చెప్పారు. దీంతో సినిమాకు రూ.50 కోట్లు నష్టం వచ్చినా, నిర్మాతపై తక్కువ ప్రభావం పడింది.

## ప్రియాంకకు గ్లోబల్ వాన్‌గార్డ్ పురస్కారం

అప్పుడప్పుడు అంతర్జాతీయ కార్యక్రమాలకు హాజరవుతూ.. రెడ్ కార్పెట్‌పై హొయలొలికిస్తుంటారు బాలీవుడ్ అందాల తార ప్రియాంక చోప్రా. ఇప్పుడామెకు మరోసారి అంతర్జాతీయ వేదికపై గౌరవం దక్కింది. ఆసియన్ పసిఫిక్‌కు చెందిన భిన్నసంస్కృతుల ప్రముఖులను సత్కరించే సంస్థ 'గోల్డ్ హౌస్'.. ఈ ఏడాది తమ గోల్డ్ గాలాలో ప్రియాంకను సత్కరించనున్నట్లు ఇటీవల వెల్లడించింది. వినోదంతో పాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులను ఎంపిక చేసి సత్కరించే ఈ సంస్థ ఈ ఏడాది గోల్డ్100 జాబితాని ఇన్‌స్టాలో అధికారికంగా పోస్ట్ చేసింది. ఇందులో ప్రియాంకని 'గ్లోబల్ వాన్‌గార్డ్ ఆనర్'తో సత్కరించనున్నట్లు పేర్కొంది. "ఒక సామాజిక మైలురాయిగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసియా పసిఫిక్‌కి చెందిన అత్యున్నత సాంస్కృతిక సమావేశంగా మారింది. ఈ సంవత్సరం ఇది మరింత ముందుకు వెళ్తుంద"నే వ్యాఖ్యల్ని జోడించింది. గోల్డ్ గాలా అయిదవ ఎడిషన్ 'ఏ న్యూ గోల్డ్ వరల్డ్' అనే థీమ్‌తో మే 9న లాస్‌ఏంజిల్స్‌లో జరగనుంది.





## మహేశ్‌బాబు సమర్పణలో 'రావు బహదూర్'.. రిలీజ్ డేట్ ఫిక్స్

'జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్' పతాకంపై ప్రముఖ హీరో మహేశ్‌బాబు సమర్పిస్తున్న చిత్రం 'రావు బహదూర్' . ఈ సినిమా విడుదల తేదీ ఖరారైంది. జూన్ 5న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.

### కాంబో రిపీట్.. డిఫరెంట్ స్టోరీ

సత్యదేవ్ హీరోగా దర్శకుడు వెంకటేశ్ మహా తెరకెక్కించిన చిత్రమిది. ఇదే కాంబినేషన్‌లో ఇంతకుముందు 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' వచ్చిన సంగతి తెలిసిందే. తమ గత చిత్రానికి భిన్నం ఈ సినిమాని తీసుకొస్తున్నారు. ఓ రాజవంశం నేపథ్యంతో సాగే సైకలాజికల్ డ్రామా ఇది. ఇందులో సత్యదేవ్ విభిన్న లుక్స్‌లో కనిపించనున్నారు. ఆయన మేకప్‌నకే రోజుకు ఐదారు గంటల సమయాన్ని కేటాయించాల్సి వచ్చేదట. ఈ సినిమాలో సత్యదేవ్ సరసన దీపా థామస్ నటించారు. మరోవైపు జూన్ 4న విడుదలకు 'టాక్సిక్' సిద్ధమవుతోంది. 'కేజీయఫ్' స్టార్ యశ్ హీరోగా పాన్ ఇండియా స్థాయిలో గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న సినిమా ఇది.



## పెళ్లి పేరిట మోసం.. ఆరోపణలపై స్పందించిన అషురెడ్డి

తనపై వచ్చిన ఆరోపణలపై నటి అషురెడ్డి స్పందించారు. తన ప్రమేయం లేకుండా తన గురించి వార్తలు రాసినా, తప్పుడు ప్రచారం చేసినా లీగల్ యాక్షన్ తప్పదంటూ హెచ్చరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.
తన కుమారుడిని పెళ్లి చేసుకుంటానని చెప్పి అషు మోసం చేసిందంటూ హైదరాబాద్ షేక్‌పేట్ వాసి యెనుముల సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.9.35 కోట్ల విలువ చేసే నగదు, బంగారం, ఫ్లాట్‌లు, వాహనాలను తన పేరుపై రిజిస్టర్ చేయించుకుందని ఆయన ఆరోపించారు. సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ రిలీజ్ డేట్‌లో మార్పు.. వారం ముందే స్ట్రీమింగ్




'ది కేరళ స్టోరీ 2' ఓటీటీ విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ఈ చిత్రం మే 8 నుంచి తమ ప్లాట్‌ఫామ్‌పై స్ట్రీమింగ్ అవుతుందని ప్రకటించిన 'జీ 5' (వవ 5) సంస్థ.. రిలీజ్ డేట్‌ను మార్చింది. మే 1 నుంచే తెలుగు ఆడియోలోనూ అందుబాటులో ఉంటుందని తెలిపింది. 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందిన 'ది కేరళ స్టోరీ 2' కూడా వివాదాల నడుమ థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. ఉల్కా గుప్త, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో కామాఖ్యా నారాయణ్ సింగ్ తెరకెక్కించారు.

**ఈ సినిమా కథేంటంటే?:** స్వతంత్ర భావాలు కలిగిన నేటితరం అమ్మాయిలు సురేఖ (ఉల్కా గుప్త), దివ్య (అదితి), నేహా (ఐశ్వర్య). కేరళకు చెందిన సురేఖ యూపీఎస్సీకి సిద్ధమవుతూ ఉంటుంది. జర్నలిస్ట్ సలీమ్ (సుమిత్ గహ్లోవత్)తో ఏర్పడిన పరిచయం లివింగ్ ఇన్ రిలేషన్‌కు దారితీస్తుంది. దివ్యకు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా రాణించాలని కోరిక. లైక్‌లు, షేర్‌ల కోసం ఆమె చేసే నృత్యాలను తల్లిదండ్రులు ప్రోత్సహించరు. అదే సమయంలో పరిచయమైన రషీద్ (యుక్తమ్) ఆమెను ప్రేమిస్తున్నానని చెబుతూ, జీవితంలో అన్ని విషయాల్లో అండగా ఉంటానంటూ భరోసా ఇస్తాడు. ఇక జావెలెన్ త్రో రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తూ.. జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతుంటుంది నేహా. ప్రేమ పేరుతో ఆమెను తనవైపు తిప్పుకొని, దిల్లీలో ప్రఖ్యాత శిక్షకుడితో ట్రైనింగ్ ఇప్పిస్తానని మాయమాటలు చెబుతాడు రాజు అలియాస్ ఫైజన్. ఇలా ముగ్గురు అమ్మాయిలు తల్లిదండ్రుల మాటలను పెడచెవిన పెట్టి ప్రేమించిన వారితో వెళ్లిన తర్వాత ఏం జరిగింది? రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక వాళ్లు తీసుకున్న నిర్ణయం ఏంటి? అన్నది ఈ సినిమా కథ.